# ప్రమాదం

సాయంకాలం ఆరు గంటలకు రోడ్డు మీద ప్రమాదం.

పల్లెనుంచి పత్తి సంచులతో వస్తున్న రెండెడ్ల బండిని వెనుకనుంచి వస్తున్న బస్సు గుద్దింది.

బండి తల్లక్రిందులుగా పడింది. ఎడ్లు రెండూ దూరంగా పడ్డాయి.

పత్తి సంచులు చెల్లాచెదురుగా పడ్డాయి. రెండు మూడు పగిలాయి. పత్తి చుట్టూ పడింది.

బండి తోలుతున్నవాడు బోల్తాపడ్డ బండి కిందున్నాడు.

పక్కన కూర్చున్నవాడు పత్తి సంచుల మీద వున్నాడు.

ఎడ్లు చచ్చిపోయాయి. మనుషులకు ఊపిరి ఆడుతూ ఉంది.

బస్సు అక్కడ లేదు. ఎటు పోయిందో తెలియదు.

అది అడవి కాదు. నగరం. పూర్తి నగరం కాదు. నగర ప్రవేశం.

చుట్టూ ఇళ్ళున్నాయి. ఇళ్ళు కావు గుడిసెలు.

జనం ఉన్నారు. బస్సును చూశారు. నెంబరుంటుందని, చూడ వచ్చునని, గుర్తు తెలుస్తుందని, కొందరికి తెలియదు. అంతే కొందరికి తెలుసు. అయితే ఎవరికీ నెంబరు చూడటం తెలియదు.

బస్సు ఇటయితే పోయింది కాని, ఎటు పోయిందో -

బస్సులో జనం లేరు. జాతీయం అయింతర్వాత బస్సులు కొన్ని కులాసాగా తిరుగుతున్నాయి. కొన్ని బస్సులు జనంలేని వూళ్ళకుపోయి వస్తున్నాయి.

బస్సు పోతేపోయింది. జనం వచ్చారు.

ఊపిరి ఆడుతున్న ప్రాణుల్ని రోడ్డుమీద పడుకోబెట్టారు.

పోలీసులకు కబురు చేయాలనుకొన్నారు.

హాస్పటల్‌కి తీసుకుపోలనుకొన్నారు

కారుతున్న రక్తం తుడిచారు. పంచెలు చించి, చొక్కాలు చించి, అవి చిరిగి వున్నాయి - కట్లు కట్టారు.

ఆడవాళ్ళు కన్నీళ్ళు కార్చారు.

యువకులు బస్సుల వాళ్ళ అఘాయిత్యాల మీద కోపం చూపారు. తీర్పులు చెప్పారు. తీర్మానాలు చేశారు.

పోలీసులకు కబురు చేయటం పిల్లి మెడలో గంట కట్టేంత కష్టమయిన పని అయిపోయింది.

కాని వీళ్ళిద్దర్నీ హాస్పటల్‌లో మాత్రం చేర్చారు.

పత్తిమీద పడ్డ మనిషి పత్తి సొంత దారు.

బండి కింద పడ్డ మనిషి బండి సొంతదారు.

పత్తి యజమానిని రక్షించింది.

బండి యజమానిని శిక్షించింది.

జనం అనుకొన్నారు. ఇతడు చనిపోవచ్చు. ఇతడు బ్రతకవచ్చు.

స్పృహలేని ఇద్దరూ హాస్పటల్ మంచాలమీద ఉన్నారు.

ప్రాణం లేని ఎడ్లు రోడ్డు పక్క వున్నాయి.

కుక్కలు వచ్చి రక్తం మరకలు నాకి, నాలుక చీకొట్టుంటున్నాయి.

జనం కసిరి వాటిని తరిమారు.

ఒకతను చిల్లా కొల్లరుగా పడ్డ పత్తిని చేత్తో ఎత్తి చాలా మెత్తగా ఉందని తెలుసుకొన్నాడు.

అతడు చెట్టుకింద రాయిమీద దివా రాత్రులు పడుకొంటాడు. తల కింద రాయి పెట్టుకొంటాడు. దిండు అతడి ఏకైక వాంఛ.

పోలీసులింకా రాలేదు.

ఉంటే అన్నం తినటానికి, లేకుంటే దెబ్బలు తినటానికి, కాకపోతే నిద్ర పోవటానికి, నిద్రరాకపోతే కడుపునిండా ఏడవటానికి ఎవరికి వాళ్ళు వెళ్ళి పోతున్నారు.

రాత్రిక్రీ నీడలో ఎద్దుల మృతదేహాలు!

అవి బ్రతికి వున్న కాలంలో యజమానికి ఎంతో సేవచేశాయి. వళ్ళు దాచుకోలేదు. చనిపోయినా వళ్ళు దాచుకోలేదు. చర్మం విలువయిందని చుట్టూ వున్న గుడిసెల వాళ్ళకు తెలియక పోలేదు.

రెండెడ్లూ ఈ బండీ అతడి యావదాస్తి. బండి చక్రాలు దొర్లితే కడుపు కదులుతుంది.

పత్తి భారతదేశ సంపదలాగా ఒక్కచోటే కుప్పపడి వుంది.

దాన్ని అమ్ముకొని పల్లెకు పోతే ప్రస్తుతానికి చాలాకష్టాలు తీరతాయన్ని నమ్మకం పెట్టుకొని పట్టణానికి వస్తున్నాడు, పత్తి సొంతదారు.

హాస్పటల్‌లో బండి మనిషి చనిపోయాడు. పత్తి మనిషి బతికిపోయాడు. దెబ్బలూ పెద్దగా తగల్లేదు. బెదురుపళ్ల స్పృహతప్పాడు.

ప్రథమ చికిత్స చేశారు. అతను కావాలను కొంటే వెళ్ళిపోవచ్చు. కాని ప్రమాదంలో పడ్డ మనిషి అని తెల్ల వారిందాకా ఉండమన్నారు.

ప్రమాదం జరిగిన చోట క్రీనీడలో తెల్ల వార్లూ నీడలున్నాయి. కుక్కలొస్తే ఎడ్ల నెత్తురు నాకుతాయి. తోలు పీకుతాయి. అని జనం వాటిని తోలుతున్నారు, రాత్రి అంతా మనుషుల మీద కుక్కలు అరుస్తున్నాయి.

తెల్ల వారిం తర్వాత పత్తి మనిషి వచ్చాడు.

ప్రమాదం జరిగిన చోట రోడ్డు పొడుగునా వెతుకు తున్నాడు.

గుడిసెలలో నుంచి జనం వెలుపలికి రాలేదు.

పోలీసు లింకా రాలేదు.

రోడ్డుమీద పడిన రక్తం మరకల్ని తడి చేసుకొని నాకుతున్న కుక్కను చూచి ప్రమాదం జరిగిన ప్రదేశం పోల్చుకొన్నాడు.

అంతేకాని మరి ఏ ఆధారం లేదు.

చుట్టూ చూశాడు. పత్తి, బండి, ఎడ్లు కనపడలేదు. గుడిసెలు కనిపించాయి.

రోడ్డుమీద జరిగిన ప్రమాదం అందరూ చూశారు. చూడవచ్చు. అది కనిపిస్తుంది.

రోడ్డు మీద జరగని ప్రమాదం అతడి కళ్ళ ముందు తిరిగింది. అది కనిపించదు.